క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు సెంట్రల్: నెల్లూరుకు విచ్చేసిన రాజ్య సభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డిని బుధవారం పలువురు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



గాంధీజనసంఘం నాయకులతో ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన నెల్లూరులోని తన నివాసంలో సంగం మండలం గాంధీజన సంఘం వైఎస్సార్‌సీపీ నాయకులతో భోజన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులు, పార్టీ పరిస్థితులను నాయకులను అడిగి తెలుసుకుని వారికి పలు సూచనలు చేశారు.

మేయర్‌కు వినతి



నెల్లూరు(బారకాస్): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ విగ్రహాన్ని సుందరీకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో నగర మేయర్ స్రవంతిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 19న స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని కార్పొరేషన్ ఆధ్వర్యంలోని విగ్రహాన్ని రంగులతో సుందరికరించి పూలతో అలంకరించాలని కోరారు. మేయర్‌ను కలిసిన వారిలో పార్టీ నాయకు లు ఫజులుద్దీన్, సాయిరామ్, ఫయాజ్ ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



నెల్లూరు (టౌన్): బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని కస్తూరిదేవి విద్యాలయంలోని విద్యార్థులకు బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ మనెమ్మ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు బాల బాలికలకు ఎలాంటి సమస్యలు వచ్చినా 1098 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవా కార్యకర్త మున్వర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నెల్లూరు(వేదాయపాళెం): పాల్–మేరీ ఫౌండేషన్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమూల్య స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పోతురాజు టోనీ బాబు ఆధ్వర్యంలో మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ సంక్షేమ బాలికల వసతి గృహంలో బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యులు కిరణ్మయి, లత, తన్వీర్ బాలికలకు సాధారణ, దంత పరీక్షలు చేశారు. డాక్టర్ రాజశేఖర్ నేత్ర వైద్యశాల వైద్యులు లలితశివజ్యోతి, ఆప్తమాలజీ అసిస్టెంట్ శాంతి, సాయికృష్ణ, సౌమ్య, సంధ్య నేత్ర పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా టోనీ బాబు మాట్లాడుతూ బాలల దినోత్సవం సందర్భంగా గత 15 ఏళ్లుగా ప్రభుత్వ బాలికల వసతి గృహంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్యశిబిరం నిర్వహణకు సహకరించిన పాల్–మేరీ ఫౌండేషన్ అధ్యక్షుడు శామ్యూల్‌జాన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్యసాయి, శీను, జిల్లు, హరిహరణ, లక్ష్మి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి

నెల్లూరు(బారకాసు): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ పరిధిలోని సచివాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొండ్రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేసి సంక్షేమ రాజ్యాన్ని ఆవిష్కరించిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గడప గడపకు సంక్షేమ ఫలాలు చేరాయని, 2024లో మరోసారి వైఎస్సార్‌సీపీని ప్రజలు గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మొయిళ్ల గౌరి మాట్లాడుతూ పేదలకు మంచి జరగాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఏడీసీ ప్రసాద్, మండల ఇన్‌చార్జి పాతపాటి పుల్లారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, కార్పొరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి, ఒరిస్సా శ్రీనివాసులరెడ్డి, కన్వీనర్ కృష్ణమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, పెంచలనర్సారెడ్డి, రజిని, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కొండ్రెడ్డి, గౌరి

వైఎస్సార్‌సీపీని ఆదరించాలి

గతంలో ఎన్నడూ లేని విధంగా రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని రూరల్ మండల జేసీఎస్ కన్వీనర్ చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలంలోని దేవరపాళెం సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే అన్ని వర్గాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ట్రెయినీ కలెక్టర్ సంజనసింహ, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, ఎంపీపీ విజయకుమార్, పార్టీ మండల కన్వీనర్ రాంప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ ఉదయభాస్కర్, వైఎస్సార్‌సీపీ నేత శివారెడ్డి, మండలాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపాళెంలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ చైల్డ్‌గ్రూప్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సభ్యులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. వారోత్సవాల విజయవంతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి కాకాణి

బాధితులను ఆదుకోవడం అందరి బాధ్యత

నెల్లూరు (వేదాయపాళెం): రోగనిరోధక శక్తితో బాధపడే బాధితులను ఆదుకోవడం ప్రతిఒక్కరి బాధ్యతని అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్‌రాయ్ పేర్కొన్నారు. బుధవారం కొండయ్యపాళెంలోని చర్చిలో అబైడింగ్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని రకాల వ్యాధులకు ప్రభుత్వం ఎంతో విలువైన మందులు అందజేస్తోందని తెలిపారు. వాటికి అనుకూలంగా పౌష్టికాహారం లేకుంటే మందులు నిష్ప్రయోజనం అవుతాయన్నారు. అలాంటి పౌష్టికాహారాన్ని ప్రతినెలా 100 మందికి అందజేస్తున్న ఫాదర్ నిర్మల్‌కుమార్‌ను అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ ఫాదర్ నిర్మల్‌కుమార్ మాట్లాడుతూ వారానికి మూడు రోజులు సోయాబీన్ పాలు విద్యార్థులకు అందజేస్తున్నామని తెలిపారు. బాధితులకు సాయపడడం ఎంతో తృప్తి కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ జయప్రకాష్ . వైఎంసీఏ కార్యదర్శి శేషగిరి మల్లన్న, సిస్టర్లు జయ, క్రాంతి, రమ, రూత్ పాల్గొన్నారు..



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

సీఎమ్మార్ బంపర్ డ్రా కారు విజేత విజయలక్ష్మి

నెల్లూరు(బృందావనం): చందన, సీఎమ్మార్ దసరా, దీపావళి బంపర్ డ్రా రెనాల్ట్ క్విడ్ కారును నెల్లూరు భక్తవత్సలనగర్‌కు చెందిన జీ విజయలక్ష్మి (కూపన్ నంబరు:15249) దక్కించుకున్నారు. బుధవారం సీఎమ్మార్‌లో దసరా, దీపావళి బంపర్ డ్రాను మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీశారు. నెల్లూరు భక్తవత్సలనగర్‌కు చెందిన జీ విజయలక్ష్మిని విజేతగా ప్రకటించారు. అనంతరం 5వ వీక్లీ డ్రా హీరో మోటార్‌బైక్ విజేత ఎస్కే మెహీద్‌కు బైక్ కీని అందజేశారు. గత వారం డైలీ డ్రా విజేతలు 35 మందికి గృహోపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ జిల్లా వాసులకు చందన, సీఎమ్మార్ అత్యంత తక్కువ ధరలకు నాణ్యమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలు అందజేయడమే కాకుండా, పండగల సందర్భంగా ఆకర్షణీయమైన అత్యంత ఖరీదైన బహుమతులు అందజేయడం సంతోషకరమన్నారు. కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్‌యాదవ్, నుడా మాజీ చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, సీఎమ్మార్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు తదితరులు పాల్గొన్నారు.



గత వారం విజేతకు హీరో మోటార్‌బైక్ కీ అందజేస్తున్న మంత్రి కాకాణి

వ్యక్తిత్వ వికాసంతో ఉన్నతంగా ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(బృందావనం): విద్యార్థులు, యువత వ్యక్తిత్వ వికాస నిపుణులు సూచించే అంశాలను ఆకళింపు చేసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి అన్నారు. నగరంలోని పురమందిరంలో మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ, నెల్లూరు పినాకిని లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మాస్టర్ మోటివేటర్ గంపా నాగేశ్వరరావు పర్యవేక్షణలో రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న మెగా ఇంపాక్ట్ కార్యక్రమాన్ని బుధవారం నగర డీఎస్పీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసంతో సామా న్య యువత జీవితాల్లో మార్పును తెచ్చేందుకు ఇంపాక్ట్ మెగా ఈవెంట్‌ను నిర్వహించడం అభినందనీయం, స్ఫూర్తిదాయకమన్నారు. మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న మెగా ఇంపాక్ట్ మోటివేషన్ ప్రోగ్రామ్‌లో మోటివేటర్స్‌తో పాటు వ్యక్తిత్వ వికాస నిపుణులు పలు విషయాలను తెలియజేస్తారని చెప్పారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారు, ఉద్యోగాన్వేషణలో ఉన్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంపాక్ట్‌కు హాజరవ్వాలనుకునే వారు ఉచిత రిజిస్ట్రేషన్ కోసం73826 48823 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ నెల్లూరు బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపల్ చైతన్య, అకడమిక్ ప్రిన్సిపల్ ప్రవీణ్, ఇంపాక్ట్ నెల్లూరు సభ్యులు మల్లికార్జునరావు, నెల్లూరు పినాకిని లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక ప్రదర్శన



నెల్లూరు(మినీబైపాస్): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత తహసీల్దార్, రచయిత పొట్లూరు సుబ్రహ్మణ్యం గ్రంథాలయానికి విలువైన పుస్తకాలను బహూకరించారు. అనంతరం ఆయన జిల్లాలోని గ్రంథాలయాలు, అందులో ఉన్న విలువైన పుస్తకాలు, వాటి సారాంశాన్ని విద్యార్థులకు వివరించారు. ఆర్ఎస్సార్ మున్సిపల్ హైస్కూల్ ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు సతీష్ కుమరా, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కే కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



మృతుడి భార్యకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 53వ డివిజన్ వెంకటేశ్వరపురం పునరావాసకాలనీకు చెందిన ఎస్‌కే గఫూర్ (28) మంగళవారం అర్ధరాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. మృతుడి భార్య సమీరకు వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ.10వేలు నగదు మంజూరవగా స్థానిక కార్పొరేటర్ దేవరకొండ సుజాత, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంగళ్‌రెడ్డి, ఆవుల విజయ్ బుధవారం అందజేశారు.

వికాస్ ఆరోగ్య దీపికకు రూ.10 వేలు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి కారంశెట్టి వీరరాఘవేంద్రరావు, రవికుమార్, రాజేష్ సోదరులు రూ.10వేలు విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వికాస్ ప్రజాహిత సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వికాస్ ఆరోగ్య దీపిక పథకం ద్వారా డివిజన్ పరిధిలోని పేదలకు ఉచితంగా ప్రతి నెలా రూ.50 వేల విలువైన మందులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ పథకానికి తమ వంతు తోడ్పాటు అందిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

నెల్లూరు రూరల్: ఒక్కరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు అనే నినాదంతో ఏర్పడిందే సహకార వ్యవస్థ అని నెల్లూరు సబ్‌డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ ఆదినారాయణ అన్నారు. చింతారెడ్డిపాళెంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో 70వ అఖిల భారత సహకార వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సహకార పతాకాన్ని ఆవిష్కరించి సహకార గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. సొసైటీల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. సహకార సంఘ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజశేఖర్, సహకార విద్యాధికారి గోగుల శ్రీనివాసులు, సహకార సంఘ ఆడిటర్ సుధీర్ కుమార్, ఇఫ్కో, క్రిబ్‌కో మేనేజర్లు, సహకార సంఘ అధికారులు పాల్గొన్నారు.



సహకార పతాక ఆవిష్కరణ

జేసీని కలిసిన సివిల్ సప్లయీస్ డీఎం



నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌ను జిల్లా పౌరసరఫరాల సంస్థ నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన పీవీ నరసింహారావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాకినాడ నుంచి బదిలీపై వచ్చిన జేసీని కలసి జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. అనంతరం పౌర సరఫరాల సంస్థకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

పారదర్శకంగా భూహక్కు పత్రాల పంపిణీ

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులైన వారికి భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి పారదర్శకంగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని మండలాల తహసీల్దార్లతో సమావేశమయ్యారు. భూహక్కు పత్రాల పంపిణీపై దిశా నిర్దేశం చేశారు. 2023 నుంచి భూములను అనుభవిస్తున్న వారికి, అసైన్‌మెంట్ కమిటీ ఎంపిక చేసిన లబ్ధిదారులు, ఇనాం భూములు సాగు చేసుకుంటున్న వారికి, చుక్కల భూములు, 22ఏ జాబితాలోని భూములకు సంబంధించిన రైతులకు భూహక్కు పత్రాలు అందజేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 17 నుంచి 25వ తేదీ వరకు చేపట్టారు. జిల్లాలో సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించే మొట్టమొదటగా భూహక్కు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ నెల 17న పొదలకూరులో నిర్వహించనున్న పట్టాల పంపిణీ కార్యక్రమానికి తహసీల్దార్లు సిద్ధంగా ఉండాలన్నారు.



సర్వేపల్లి నియోజకవర్గ తహసీల్దార్లతో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు ఏఎంసీ చైర్మన్‌గా పేర్నాటి కోటేశ్వరరెడ్డి



పేర్నాటి కోటేశ్వరరెడ్డి

నెల్లూరు రూరల్: నెల్లూరు మార్కెటింగ్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ గుంటూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎంసీ చైర్మన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్‌గా ఒట్టూరు సుధాకర్, సభ్యులుగా తగరం మాధవి, రామలింగారెడ్డి శిరీష, జీ శిరీష, కొంగర శీనయ్య, బండి చెంచయ్య, తాండ్ర సుజాత, ఈగా విజయమ్మ, తాటిపర్తి వెంకటేశ్వర్లు, బోడ్డు అనిత, స్వర్ణా జీవన్‌ప్రసాద్, మంచికంటి శ్రీనివాసులు, ఉప్పు నవిత, ఉప్పు ప్రసన్నను నియమితులయ్యారు. ఎంతో కాలంగా వైఎస్సార్‌సీపీని నమ్ముకుని ఉన్న వారికే పదవులు వరించాయి. కోటేశ్వరరెడ్డి కాంగ్రెస్ పాలనలో మాజీ సీఎంలు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల హయాంలో పలు పదవులు పొందారు. గత కొంత కాలంగా నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి విధేయుడిగా ఉంటున్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని చెప్పారు. తనకు పదవి రావడానికి సహకరించిన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిస్సాన్ మ్యాగ్నైట్ ఈజెడ్ ఏఎంటీ కారు మార్కెట్లోకి విడుదల

నెల్లూరు (టౌన్): మినీబైపాస్‌లోని హైటెక్ నిస్సాన్ కారు షోరూంలో నిస్సాన్ మ్యాగ్నైట్ ఈజెడ్ ఆటోమేటిక్ కారును మేనేజింగ్ డైరెక్టర్ సీ జగన్నాథరెడ్డి, డైరెక్టర్లు నిరంజన్, హోషిమారెడ్డి, భారతి మార్కెట్లోకి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం జనరల్ మేనేజర్ ఎస్వీఎస్ శాస్త్రి మాట్లాడుతూ నూతన కారు ధర రూ.6.49 లక్షలని తెలిపారు. 205 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్, 336 బూటు స్పేస్, 8 టచ్ స్క్రీన్, రివర్స్ కెమెరా, అలయ్ వీల్స్, వైర్‌లెస్ కనెక్టివిటీ, రేర్ ఏసీ కారు ప్రత్యేకతలని వివరించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ గోపి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



కారును మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

మంత్రి కాకాణిని కలిసిన రైతు సంఘ నాయకులు



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో జిల్లా రైతు సంఘ నాయకులు బెజవాడ గోవిందరెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో రైతు సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో చర్చించి పెన్నా డెల్టాకు సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటించడంపై మంత్రిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

నేత్రదానం



ప్రమీలమ్మ(ఫైల్)

నెల్లూరు సిటీ: పొదలకూరురోడ్డులో నివాసం ఉంటున్న ప్రమీలమ్మ (75) అనారోగ్యంతో మృతి చెందగా నేత్రాలను కుటుంబ సభ్యులు బుధవారం దానం చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఏసీఎస్ఆర్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఐ డొనేషన్ కౌన్సిలర్ బాలాజీసింగ్, ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ బీ లాలేష్ నేత్రాల(కార్నియా)లను సేకరించారు.